క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో దరఖాస్తులపై విచారణ చేపడుతాం


జాహెద్‌పాషా

రామగుండం: మండల పరిధిలోని అన్యాక్రాంత మవుతున్న ప్రభుత్వ భూముల్లో కొన్నేళ్లుగా స్థిర నివాసం ఏర్పర్చుకున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించామని రామగుండం తహసీల్దార్ జాహెద్‌పాషా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఛాంబర్‌లో మాట్లాడారు. 59 జీవో ప్రకారం ప్రభుత్వ భూముల్లో స్థిరనివాసం ఏర్పర్చుకున్న వారినుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో మంగళవారం అధికారులతో విచారణ చేపట్టి అసలైన లబ్ధిదారులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులు తమ ఇళ్లలో అందుబాటులో ఉండాలని కోరారు. విచారణ బృందం అధికారులు తమ వద్దకు వచ్చి పలుఅంశాలపై విచారణ చేపట్టి వివరాలను నమోదు చేసుకుంటారన్నారు. అధికారులకు సహకరించాలని తహసీల్దార్ కోరారు.

ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్...


అభినందిస్తున్న తహసీల్దార్ గిరి

మంథని: మండలంలో జీవో 59కింద 173 మందిని అర్హులుగా ఎంపికచేయగా సోమవారం చిల్లపల్లికి చెందిన కోసరాజు కమల రూ.2,23,725 చెల్లించగా, రెండు గుంటల ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ గిరి తెలిపారు.ఆమెను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. అర్హులైన వారు డబ్బులు చెల్లించి ఇంటిస్థలాన్ని రిజిస్ట్రేష న్ చేయించుకోవాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ రవిశంకర్, ఆర్ఐలు రాజిరెడ్డి, త్రివేణి ఉన్నారు.

ఎఫ్‌సీఐ డైరెక్టర్‌కు సన్మానం


డైరెక్టర్ తిరుపతిని సన్మానిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఎఫ్‌సీఐ డైరెక్టర్‌గా నియమితులైన పులగం తిరుపతిని సోమవారం పెద్దపల్లిలో బీజేపీ నాయకులు సన్మానించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో పూలమాలలు, శాలువాతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలారపు పర్వతాలు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్‌తో పాటు సీనియర్ నాయకులు తంగేడ రాజేశ్వర్‌రావు తదితరులు సన్మానించారు.

12న చలో సీడీఎంఏ


మాట్లాడుతున్న నాగమణి

కోల్‌సిటీ: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న చేపట్టిన చలో హైదరాబాద్ సీడీఎంఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వడ్లకొండ నాగమణి కోరారు. ఫైవింక్లయిన్‌లో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేర నియంత్రణకు సహకరించాలి


స్వాధీనం చేసుకున్న వాహనాలు

గోదావరిఖని: నేరాల నియంత్రణలో కఠినంగా వ్యవహరిస్తామని గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సంజయ్‌గాంధీనగర్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో 30మంది అధికారులు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పత్రాలు సరిగా లేని 55 ద్విచక్రవాహనాలు, తొమ్మిది ఆటోలు సీజ్ చేశారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి ఉంటుందన్నారు. గోదావరిఖని రెండోసీఐ ప్రసాద్‌రావు, ఎస్సైలు సమ్మయ్య, స్వామి, వెంకట్ పాల్గొన్నారు.

జీజీహెచ్ కిటకిట





కోల్‌సిటీ: గోదావరిఖనిలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర బాధితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆ స్పత్రులు కిటకిటలాడుతున్నాయి. సోమవారం గో దావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) రో గులతో కిక్కిరిసిపోయింది. ఓపీ విభాగం ముందు ప్రజలు బారులు తీరారు. గర్భిణులు కూర్చోవడాని కి స్థలం లేక ఇబ్బందులు పడ్డారు. సుమారు 650 మందికి పైగా ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేందుకు వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు, గర్భిణులకు పలు సూచన లు చేశారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఐదో రోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె


సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

రామగుండం/ఓదెల/ఎలిగేడు/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లో జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం ఐదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రాజంపేటలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన మల్లేశ్ కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం రూ.20 లక్షలపరిహారం చెల్లించాలని జీపీ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం 2 నిమిషాలు మౌనం పాటించారు. గ్రామాల్లో పనులను బహిష్కరించి, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో పాల్గొని నిరసన తెలిపారు. తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు వీరికి సంఘీభావం తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన గృహోపకరణాలు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో నిరుపేద రైతు గడ్డం రాజేశ్వర్‌రెడ్డికి చెందిన పెంకుటిళ్లు కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు కాలిపోయింది. బాధితుని కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రపోయేందుకు సిద్ధం కాగా విద్యుత్ తీగల నుంచి శబ్దం రావడంతో కటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. చూస్తుండగానే మంటలు అంటుకుని ఇళ్లు దగ్ధమైందని గ్రామస్తులు నీటితో మంటలను ఆర్పేశారు. మంటల్లో రూ.40వేల నగదు గృహోపకరణాలు ఫర్నిచర్, బట్టలు, నిత్యవసర సరుకులు కాలిపోయాయి. బాధితునికి రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. ఘటన స్థలాన్ని సర్పంచ్ సంతోశ్‌రావు, ఎంపీటీసీ మల్లేశం యాదవ్, నాయకులు కుంట రాజేశ్వర్‌రెడ్డి, గ్రామపెద్దలు పరిశీలించి సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వకీల్‌పల్లి గని సందర్శన

గోదావరిఖని: ఆర్జీ–2 పరిధి వకీల్‌పల్లిగనిని డీడీఎంఎస్ మైనింగ్ బానోతు వెంకన్న సోమవారం సందర్శించారు. గనిలోకి దిగి పనిస్థలాల్లో రక్షణ చర్యలు తనిఖీ చేశారు. గని ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం

గోదావరిఖని: కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. సోమవారం జీడీకే–11గనిపై గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. నాయకులు మెండె శ్రీనివాస్, గజేంద్ర, ఆరెపల్లి రాజమౌళి, రఘువరన్, దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రామగుండం

గోదావరిఖని: అభివృద్ధిలో రామగుండం నియోజకవర్గం అగ్రగామిగా నిలుస్తోందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తిలక్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి కొందరు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతర్గాం జెడ్పీటీసీ అముల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారించాలి

గోదావరిఖని: సింగరేణి సూపర్‌బజార్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిపై విచారణ జరపాలని సింగరేణి సూపర్ బజార్ ఉపాధ్యక్షులు వంగ వెంకట్, డైరెక్టర్ మడ్డి ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. సూపర్‌బజార్ ఎండీకి వినతి పత్రం అందజేశారు.

అసత్య ప్రచారంపై ఫిర్యాదు

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు వన్‌టౌన్‌లో ఫిర్యాదుచేశారు. కార్పొరేటర్లు ఇంజపురి పులీందర్, పాముకుంట్ల భాస్కర్, బొడ్డు రవీందర్ సీఐని కలిసి విన్నవించారు.

బకాయిలు చెల్లించాలని ఆందోళన

పెద్దపల్లిరూరల్: అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని అమరవీరుల స్థూపం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. వంట పాత్రలు, కోడిగుడ్లు, వంటగ్యాస్, పప్పులు, నూనె, చింతపండు సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, వర్కర్ల సంఘం నాయకుడు పూసాల రమేశ్ డిమాండ్ చేశారు. కనీస వేతనంగా రూ.6వేలను వేతనంగా ఇవ్వాలన్నారు. వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు బండారి వసంత, లక్ష్మి, కళావతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సుల్తానాబాద్: మధ్యాహ్న భోజన వర్కర్లకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరసనలో పాల్గొన్నారు. వర్కర్లకు వేతనాలు పెంచుతామని చెప్పిన సీఎం కేసీఆర్ మాట తప్పారన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

'గీట్ల'కు ఘన నివాళి

మంథని: దివంగత శాసన మండలి మాజీ సభ్యుడు గీట్ల జనార్దన్ జయంతి వేడుకలను మంథనిలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ సభ్యురాలు తగరం సుమలత, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ ఉన్నారు.

పంచాయతీ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక

జూలపల్లి: గ్రామపంచాయతీ కార్మికసంఘం మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బాణయ్య, అధ్యక్షుడిగా వైద్య సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అప్సర్, ట్రెజరర్‌గా చిప్ప సత్యం, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమల్ల నాగేశ్వర్, కార్యదర్శిగా భాస్కర్, లక్ష్మణ్, సభ్యులను ఎనుకున్నట్లు తెలిపారు.



పాఠశాల చుట్టూ చెట్లపొదలు

కమాన్‌పూర్: రామగిరి మండలం పన్నూర్‌శివరాంనగర్‌లోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల చుట్టూ ఆవరణం పిచ్చిమొక్కలు, చెట్ల పొదలతో నిండిపోయింది. చెట్లపొదలు కిటికీల వరకు పెరగడంతో పాములు, క్రిమికీటకాలు తరగతి గదుల్లోకి వచ్చే ప్రమాదముందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పిల్లలకు ప్రమాదం జరగకముందే పొదలను తొలగించాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలకు నోట్‌బుక్స్ వితరణ

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు చెందిన పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పడాల రామానుజన్ సోమవారం గ్రామ ప్రాథమిక పాఠశాలకు కథలు, నీతి, పజిల్స్, పౌరాణిక గ్రంథాలయ పుస్తకాలు, పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోపు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

రామగుండం: పట్టణంలోని టెంపుల్‌రోడ్డులో నివసిస్తున్న పులి కుమార్ వ్యక్తి ఇంటికి వెళ్లేక్రమంలో ఎక్కడో పడిపోయింది. ఈనేపథ్యంలో సోమవారం తన సెల్‌ఫోన్ పోయిందని రామగుండం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈక్రమంలో సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి రామగుండం ఎస్సై బత్తుల శరణ్య బాధితుడికి అప్పగించినట్లు పోలీస్‌స్టేషన్ రైటర్ కిరణ్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్: బదిలీపై కాల్వశ్రీరాంపూర్‌కు వచ్చిన తహసీల్దార్ బిట్ల సుధాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజకొమురయ్య, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దేవయ్య, రాజు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్‌కు చెందిన గొర్రెకాపరులకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన గొర్రెలను సోమవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 72 మందికి రెండో విడతలో గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉండగా ప్రస్తుతం 43 మందికి రెండో విడతలో గొర్రెలు పంపిణీ చేశామన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

జూలపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెకు తరలిన సెకండ్ ఏఎన్ఎంలు

సుల్తానాబాద్: తమను రెగ్యులర్ చేయాలని 2వ ఏఎన్ఎంలు 48 గంటల సమ్మెకు జిల్లా నలుమూలల నుంచి అత్యధిక మంది తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌లోని కోఠి ప్రధాన కార్యాలయంలో ధర్నాలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. జిల్లా నాయకురాలు స్వరూప, పలువురు ఉన్నారు.

కాంట్రాక్టర్ల ఫైళ్లు ఇంటి దగ్గరే పరిశీలన?

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని కొందరు ఇంజినీర్లు రూటు మార్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్యాలయంలో పరిశీలించాల్సిన కాంట్రాక్టర్ల ఫైళ్లను, కొందరు ఇంజినీర్లు ఇంటికి తెప్పించుకుని పరిశీలించి సంతకాలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కార్యాలయం తెరిచి ఉన్న సమయంలో పనులు చేయాల్సిన అధికారులు, కార్యాలయానికి రాకుండా ఇంటి దగ్గరే ఫైళ్లను పరిశీలిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

సెక్యూరిటీ గార్డులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

కమాన్‌పూర్: ఆర్జీ–3 పరిధిలో ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకు ప్లాంట్ నిర్వాహకులు సహకాలంలో వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డులకు తక్కువ వేతనం చెల్లిస్తున్నారని ఈవేతనం కూడా సమయానికి చెల్లించకపోవడంతో వారి కుటుంబాలను పోషించుకోవడం కష్టం ఉందన్నారు. వేతనాలు చెల్లించాలని ఒత్తిడిచేస్తే విధుల నుంచి తొలగిస్తున్నారన్నారు. సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించని యేడల సింగరేణివ్యాప్తంగా సోలార్ ప్లాంట్‌ల వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

13న ఉచిత నేత్రవైద్యశిబిరం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని జెండా చౌరస్తా వద్ద అమర్‌చంద్ కళ్యాణ మండపంలో ఈనెల 13న ఉచితనేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దపల్లి అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు తెలిపారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో వైద్యపరీక్షలు ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. క్యాంపునకు వచ్చే వారు తమవెంట తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 9849890646లో సంప్రదించాలని కోరారు.

12న పాఠశాలల బంద్

పెద్దపల్లిరూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న పాఠశాల, కళాశాలలు మూసివేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, రాష్ట్రనాయకుడు బాలసాని లెనిన్ తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని నాయకులు ప్రశాంత్, స్టాలిన్, లిటిల్, మహేశ్ కోరారు.

పే స్కేల్ వర్తింపజేయాలి

పెద్దపల్లిరూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం పేస్కేల్ వర్తింపజేసేలా చూడాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి విన్నవించినట్లు ఉద్యోగసంఘ నాయకులు లింగన్న, వెంకటేశ్, విజయ్, రఘు, ప్రసాద్, బాలయ్య తెలిపారు. సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మంథని: మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన బీఎస్పీ మాజీ మండలాధ్యక్షుడు బూడిద మల్లేశ్ తన అనుచరులతో సోమవారం మంథనిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి సమక్షంలో చేరారు. సునీల్ వారికి కండువా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని మోదీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు తెలిపారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్క మోహన్‌రావు, కో–కన్వీనర్ నాంపల్లి రమేశ్, మండలాధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, పట్టణాధ్యక్షుడు బూడిద తిరుపతి తదితరులు ఉన్నారు.

నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొనాలన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి


మాట్లాడుతున్న భిక్షపతి

జ్యోతినగర్: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించాలని ఇళ్లస్థలాల సాధన కమిటీ కన్వీనర్ ఎస్. భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో వడ్లకొండ నాగమణి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇళ్ల స్థలాల పోరాటంలో ఇళ్లులేని నిరుపేదలు పాల్గొని తాత్కాలికంగా ఇళ్లను నిర్మించుకుని భవిష్యత్‌లో అక్కడే నివాసం ఉండేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ అధికారులు, కలెక్టర్ స్పందించి అర్హులైన నిరుపేదలకు 125 గజాల ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీట్ల లక్ష్మారెడ్డి, టీం లీడర్లు స్రవంతి, శిరీష, అలివేలు మంగ, ముంతాజ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన బీఎస్పీకే సాధ్యం


ప్రచారంలో పాల్గొన్న దాసరి ఉష

సుల్తానాబాద్: మౌలిక వసతుల కల్పన బీఎస్పీకే సాధ్యమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని 6,7వ వార్డుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు నిధులు మంజూరు చేయడంలో విఫలమయ్యారన్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే ఉద్యోగులందరిని పర్మినెంట్ చేస్తామన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని డాక్టర్ ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కందికంటి విజయ్, రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ పటేల్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ ఆముదాల అరుణ, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు బోయిని రంజిత్, మండల కోశాధికారి అల్లేపు చంద్రశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం ఉపాధ్యాయ, ఇతర శాఖల నాయకులు జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 23న నిర్వహించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ అందకుండా కుట్ర పన్నుతున్నాయని స్టీరింగ్ కమిటీ నాయకుడు గద్దె శ్రీనివాస్ ఆరోపించారు. జిల్లాలో ఉన్న రైల్వే, ఇన్సూరెన్సు, బ్యాంకింగ్, ఉపాధ్యాయ సంఘాలతో జాయింట్ ఫోరం ఏర్పాటు చేసి ప్రభుత్వంపై ఒత్తిడిపెంచేందుకు సదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. పాత పింఛన్ విధానాన్ని కోరుకునేవారంతా పాల్గొనాలని కోరారు. వివిధ ఉద్యోగసంఘాల నాయకులు లక్ష్మణ్, పోచయ్య, రాంకిషన్‌రావు, శ్యాంసుందర్, సత్యనారాయణ, దినేష్, వేణుగోపాల్‌రెడ్డి, అనిల్, శివమణి, ఉన్నారు.

రాజమౌళికి ఘన సన్మానం


సన్మానిస్తున్న పురోహిత సంఘం సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీ విశ్వకర్మ శివాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగుల మల్యాల రాజమౌళి చార్యులను రామగుండం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. రాజమౌళిని బీఆర్‌ఎస్ యైటింక్లయిన్‌కాలనీ సమన్వయ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియమించినందుకు సన్మానించినట్లు పురోహితుల సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన బీఆర్‌ఎస్ నాయకులకు, సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ సాగంటి శంకర్, నాయకులు గోపాల్ రావు, పురోహిత సంఘం అర్చకులు ముత్తోజు వీరబ్రహ్మచార్యులు, శ్రీనివాస్ చారి, నాగరాజు, అరవిందచారి, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పుస్తక సమీక్ష


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాల గ్రంథాలయంలోని 800 పుస్తకాలను ప్రదర్శించి వివిధరకాల కథల పుస్తకాలతో పాటు పాఠ్యపుస్తకాలను అందించి విద్యార్థులకు గ్రంథాలయం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు జి.జగదీశ్వర్, శంకర్, శివ, సారయ్య, రామస్వామి, జ్యోతి వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయి పటేల్ జాతీయ అవార్డు పంపిణీ


అవార్డు అందుకుంటున్న సదయ్య గౌడ్

సుల్తానాబాద్: హైదరాబాద్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో మదర్ ఇండియా బుక్ఆఫ్ వరల్డ్ రికార్డ్ చీఫ్ దాసరి స్వప్న మహేశ్ చేతుల మీదుగా ఏగోలపు సదయ్యగౌడ్‌కు జాతీయ అవార్డు అందించారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఏగోలపు కుమార్ గౌడ్ ట్రస్ట్ చైర్మన్ సదయ్యగౌడ్ కరోనా కష్టకాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదవారిని ఆదుకున్నందుకు ఈ అవార్డుకు ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పురస్కారానికి ఎంపిక చేసిన మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మంథని: వర్షాకాల సీజన్ ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ప్రజ లు జాగ్రత్తలు తీసుకోవాలని మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ కోరారు. సోమవారం మంథని మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడలో మిషన్ భగీరథ పైపులైన్ పనులను పర్యవేక్షించారు. పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తాగునీటి సమస్యతో విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారని, ప్రిన్సిపాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చొరవ చూపారు.



క్లోరినేషన్ చేపట్టాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని బీసీ సంఘం నాయకులు ఆకుల స్వామి వివేక్‌పటేల్ కలెక్టర్ సంగీతకు విన్నవించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.